సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



గంజాయి స్వాధీనం

వాహన తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్ అధికారులు భద్రాచలం, అశ్వారావుపేట ప్రాంతాల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో



శ్రీమంతుడు.. శ్రీనివాసరెడ్డి!

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎమ్మెల్యేలలో పాలేరు నుంచి ఎన్నికైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రీమంతుడిగా నిలిచారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

కనుల పండువగా రామయ్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

సుజాతనగర్: మండలంలోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తుండగా, మంగళవారం 131 మందికిగాను 130 మంది హాజరయ్యారు. ఒక్కరే గైర్హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సీతారామ నిర్వాసితుల భూములు పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్

మణుగూరు రూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కోల్పోతున్న రైతుల భూములను మంగళవారం భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ సందర్శించి పరిశీలించారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న నిర్వాసిత రైతులు తమకు పరిహారం అందలేదని గతంలో వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆర్డీఓ భూములను సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ అవగాహన కల్పించాలి



డీఈఓ వెంకటేశ్వరాచారి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సమ్మక్క–సారలమ్మ జాతరపై పర్యావరణ అవగాహన కల్పించాలని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి సూచించారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతర్ల సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం తేవడానికి తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, విద్యాశాఖ సంయుక్తంగా మాదిరి పర్యవరణ జిల్లా పరిషత్ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. మాదిరి జిల్లా పరిషత్ సమావేశంలో 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. రవాణా, తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానఘట్టాలు, ప్లాస్టిక్ వినియోగం, చెత్త సేకరణ తరలింపు, నీటి నాణ్యత, రద్దీ నిర్వహణపై, మాంసాహార వ్యర్థలపై చర్చించాలని సూచించారు. ఉత్తమ మాదిరి జిల్లా పరిషత్‌లకు బహుమతులు అందజేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు కోసం డీఎస్ఓ చలపతిరాజును సంప్రదించాలని కోరారు.

ముమ్మరంగా వెండి వాకిలి పనులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో ఉన్న గర్భ గుడి ద్వారానికి వెండి వాకిలి ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ద్వారానికి బంగారు వాకిలి ఉండగా తాజాగా సుమారు 100 కిలోల వెండి మరో వాకిలి తయారు చేస్తున్నారు. ఈ పనులు పూర్తి కావడానికి మరో నెల రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ట్రస్ట్ బోర్డు చైర్మన్ పదవిపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఇటీవల కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి సారించింది. దీంతో చైర్మన్ పోస్టు ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు, ఆధ్యాత్మికవేత్తలు రాజధాని బాటపట్టారు. ఎవరికి వారు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దశాబ్దకాలం తర్వాత పాలకవర్గం ఏర్పాటుపై ఊహాగానాలు వస్తుండగా, భక్తులతోపాటు నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. – భద్రాచలం

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామివారి ఆలయం



రామయ్య కటాక్షం ఎవరికో..?

భద్రాచల రామాలయం ట్రస్ట్ బోర్డు నియామకంపై కదలిక

- పాలకవర్గ చైర్మన్ పదవి కోసం పలువురి ప్రయత్నాలు
- రేసులో కాంగ్రెస్ నాయకులు, ఉద్యమకారులు
- నియామకం జరిగితే స్వరాష్ట్రంలో ఇదే తొలిపాలకవర్గం

అందరి దృష్టీ ట్రస్ట్‌బోర్డుపైనే..

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నామినేటెడ్ పోస్టుల భర్తీపై స్పష్టత ఇవ్వడంతో పలువురి దృష్టి భద్రాచలం దేవస్థానం ట్రస్టుబోర్డుపై పడింది. రామాలయంలో 13వ ట్రస్ట్ బోర్డు పాలకవర్గం 2010, నవంబర్ 26 నుంచి 2012, నవంబర్ 25 వరకు పనిచేసింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ట్రస్టు బోర్డుకు పాలకవర్గాన్ని నియమించలేదు. దీంతో బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు తీవ్ర నిరాశ చెందారు. కాగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని భావిస్తుండటంతో పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తల్లో జోష్ నెలకొంది.

పాలకవర్గంలో 9 మంది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆలయ ట్రస్ట్ బోర్డుకు 13 పాలకవర్గాలు పనిచేశాయి. తొలిసారిగా 1960లో దేవస్థానం దేవాదాయ శాఖ పరిధిలోకి రాగా, నాటి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కల్లూరి చంద్రమౌళి తొలి చైర్మన్‌గా పనిచేశారు. 13వ చైర్మన్‌గా కురిచేటి పాండురంగారావు బాధ్యతలు నిర్వర్తించారు. తొలుత ఐదుగురు సభ్యులతో ఉన్న పాలకవర్గం.. చివరి పాలకవర్గం నాటికి 9 మందికి చేరింది. వీరితోపాటు ఆలయ ప్రధాన అర్చకుడు ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా పనిచేశారు.

సభ్యుల సంఖ్య పెరిగేనా..?

బీఆర్ఎస్ ప్రభుత్వం 14 మందితో పాలకవర్గం ఏర్పాటు చేస్తుందని ప్రచారం జరిగినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు 9 మంది సభ్యులతోనే కొనసాగిస్తుందా? లేక సభ్యుల సంఖ్య పెంచుతుందా? అనే చర్చ కూడా సాగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అనుచరగణం భారీగా ఉంది. ఆశావహులు తమ నేతలకు ఇప్పటికే ప్రొఫైల్స్‌ను అందచేశారు. మంత్రుల అనుచరులకు తగిన ప్రాధాన్యం ఇచ్చి న్యాయం చేయాలనుకుంటే ట్రస్ట్ బోర్డు సభ్యుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ముమ్మర ప్రయత్నాలు

చైర్మన్ పదవిపై కన్నేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు రాజధాని బాట పట్టారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి దేశవ్యాప్తంగా పేరుండటంతోపాటు వీఐపీలు, వీవీఐపీలు తరచుగా దర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో ట్రస్టు బోర్డు చైర్మన్‌పై పలువురు తెలంగాణ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగి ఒకరు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించటంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమ పరిచయాలు తనకు కలిసి వస్తాయని ఆయన భావిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న మంత్రులతో సామాజికవర్గ సంబంధాలు ఇతనికి అనుకూలంగా మారే అవకాశం ఉంది. భద్రాచలానికే చెందిన ఓ కాంగ్రెస్ యువనేత ఢిల్లీలో, హైదరాబాద్‌లో తనకున్న పరిచయాలతో తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వీరితోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

నిత్యావసరాలు దాచిపెట్టొద్దు

- నరుకుల నిల్వ వివరాలు ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయాలి
- వ్యాపారుల సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిత్యావసర వస్తువులను అక్రమంగా దాచిపెట్టి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యాపారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక, వాణిజ్య వ్యాపారులతో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. వ్యాపారులు నిత్యావసర వస్తువుల స్టాకు వివరాలను ప్రతి శుక్రవారం ప్రభుత్వ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలో 1,59,432 ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు తెలిపారు. 90 శాతం రైతులు సన్న రకాల ధాన్యం, మిగిలిన 10 శాతం దొడ్డు రకం ధాన్యం, ఆరువేల ఎకరాల్లో పప్పు ధాన్యాలు పండిస్తున్నారని వివరించారు. బియ్యం, పప్పులు, వంటనూనెల స్టాకు తప్పకుండా ఆన్‌లైన్ చేయడంతోపాటు జిల్లా పౌర సరఫరాల అధికారికి నివేదిక అందజేయాలన్నారు. ధరల స్థిరీకరణ పాటించాలని, అధికారులు తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఉద్యాన పంటల సాగులో కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రజలు ఇళ్లలోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు పెంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. గత సంవత్సరం, ఈ సంవత్సరానికి నిత్యావసరాల ధరల్లో వ్యత్యాసాలకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర వస్తువుల కొరత రావొద్దని, వ్యాపారులదే బాధ్యతని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబు, అధికారులు రుక్మిణీదేవి, త్రినాథ్‌బాబు, అభిమన్యుడు, జినుగు మరియన్న, అలీం, డీఎం సునీత పాల్గొన్నారు.

సమరయోధులను స్ఫూర్తిగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల, అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను, పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక సూచించారు. జాతిపిత గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి రెండు నిమిషాలు మౌనంపాటించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతమాత విముక్తి కోసం జరిగిన స్వాతంత్రోద్యమంలో ఎందరో ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య సాధనలో గాంధీజీ సత్యం, అహింస మార్గాన్ని ఎంచుకుని పలు ఉద్యమాలు నిర్వహించారని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్వో రవీంద్రనాథ్, డీసీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు తదితరులు

అమరవీరుల త్యాగం మరువలేనిది

కొత్తగూడెంటౌన్: అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ బి.రోహిత్‌రాజు అన్నారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ, పోలీసు అధికారులు, ఉద్యోగులు అమరవీరులు, స్వాతంత్ర సమరయోధులను స్మరిస్తూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ మహాత్ముని సేవలను కొనియాడారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐ వెంకటేశ్వర్లు, కార్యాలయం ఈఓ జయరాజు, ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, రాజువర్మ, సుధాకర్, కృపారావు పాల్గొన్నారు..

ప్రభుత్వాస్పత్రిలో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నట్లు డీసీహెచ్ డాక్టర్ రవిబాబు తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 25న ఒక వ్యక్తికి మోకాలి మార్పిడి ఆపరేషన్ విజయవంతం నిర్వహించామని, మరో వ్యక్తి ఆపరేషన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇటీవల ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఆస్పత్రిని సందర్శించినప్పుడు గుర్తించిన లోపాలను సరిచేసుకోవాలని సిబ్బందికి సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించొద్దని, బయోమెట్రిక్ అటెండెన్స్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణను ఆదేశించారు. మరో ఆర్‌ఎంఓను నియమించాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా సిబ్బందికి డ్యూటీలు వేయాలని సూచించారు. వచ్చే నెల 10న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ ఏరియా ఆస్పత్రి సందర్శనకు వస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల స్టాఫ్ నర్సులపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపామని, అందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆస్పత్రి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్‌ఎంఓ రాజశేఖర్ రెడ్డి, విజయరావు, కైలాష్ మోహన్, దేవరాజ్, యుగంధర్, ప్రవీణ్, సంతోష్, సుమన్, మాధూరి, శ్రీనిధి, పవన్ రెడ్డి, గీతాపవని, మల్లేష్, కిషన్, జగదీష్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం ఆదర్శనీయం

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: జాతిపిత మహాత్మాగాంధీ జీవితం ప్రజలందరికీ ఆదర్శనీయమని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో ప్రాణత్యాగం చేయగా.. అమరుల జ్ఞాపకార్థం గాంధీ వర్ధంతి అయిన జనవరి 30న అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థులకు అన్ని వసతులు

గిరిజన విద్యార్థుల ఉన్నతి కోసం ఐటీడీఏ ఆధ్వర్యాన ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు అందజేయాల్సిన పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్నులు తదితర సామగ్రి కోసం టెండర్లను ఆయన మంగళవారం ఖరారు చేశారు..

ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: త్వరలో ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో అధికారులు ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న యూనిట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తెలిపిన సమస్యలు, వాటి పరిష్కారంపై పంపిన నివేదికల జాబితాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు భాస్కర్, మునీర్‌పాషా, రమణయ్య, విజయ్‌కుమార్, రూపాదేవి, నర్సింహారావు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇచ్చే సామగ్రిని పరిశీలిస్తున్న పీఓ

జంతు సంరక్షణ అందరి బాధ్యత

సూపర్‌బజార్(కొత్తగూడెం): జంతువులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిదని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు అన్నారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెటింగ్, పంచాయతీరాజ్, విద్య, సమాచార, పశుసంవర్ధక శాఖ, జంతుహింస నివారణ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 14 నుంచి 30వ తేదీ వరకు జీవాల సంరక్షణ, మనుగడపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జంతు సంరక్షణ పక్షోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. జంతువులు, పక్షుల ఎగుమతి, దిగుమతి చట్టరీత్యా నేరమన్నారు. జంతువధ శాలలను తనిఖీ చేయాలని సూచించారు. వీధికుక్కల వృద్ధి నియంత్రణకు కుక్కలకు గర్భనిరోధక శస్త్ర చికిత్సలు చేయాలని సూచించారు. అనంతరం పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పురంధర్, డీపీఆర్ఓ శ్రీనివాస్, డీఎం అలీం, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, అన్నపూర్ణ గోసంరక్షణ సమితి అధ్యక్షుడు ఆంజనేయశర్మ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై సమావేశం

సీసీఐ ఆధ్వర్యంలో జరిపిన పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో 9,057 మంది రైతుల నుంచి 25,22,812 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశామని, రూ.146.06 కోట్లను రైతులకు చెల్లించామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేదీ వరకు పత్తికొనుగోళ్లు జరుగుతాయని తెలిపారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

అశ్వాపురం: రైతులు కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. అశ్వాపురంలో గాదె సీతయ్య, జగ్గారం గ్రామంలో అప్పారావు, పలువురు రైతుల టమాట, కూరగాయల తోటలను మంగళవారం అధికారులు సందర్శించారు. కూరగాయల సాగుపై రైతులతో మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ రైతులు ఎత్తుమడులు, డ్రిప్, బిందు సేద్యం, పందిళ్లు, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలన్నారు. నిత్యం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు టమాట, వంగ, బెండ, బీర, సొర, పూదినా, కొత్తిమీర, దోస, చిక్కుడు, మునగ, ఆకుకూరలు మొదలైన కూరగాయలను సాగు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఆయిల్‌పామ్ అభివృద్ధి అధికారి ఆకుల బాలకృష్ణ, కార్యాలయ అధికారి సముద్రాల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టమాట తోటను పరిశీలిస్తున్న మరియన్న తదితరులు

యాసంగిలో 97 శాతం..



లక్ష్మీదేవిపల్లి మండలంలో సాగు చేస్తున్న వరి

యాసంగి సీజన్‌లో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో..)

పంట	సాధారణ 2022-23	సాధారణ 2023-24	సాగైనది	శాతం
వరి	62,417	36,867	27,580	75
జొన్న	944	807	180	22
మొక్కజొన్న	28,497	16,913	14,604	86
పత్తి	145	34	7	21
పెసర	880	1428	152	11
మినుము	858	837	133	16
కంది	21	46	1	2
వేరుశెనగ	2,747	2,414	1,304	54
కుసుమ	249	410	26	6
పొద్దుతిరుగుడు	501	514	179	35
అలసంద	1,651	1,146	529	46
ఉలవ	0	9	0	0
చెరకు	1,288	675	0	0
పొగాకు	1,222	1,128	120	11
ఇతరములు	57,814	57,814	57,978	100
	1,59,234	1,21,042	1,02,793	85
ఉద్యాన పంటలు				
మిర్చి	5,405	4,082	4,286	105
ఆయిల్‌పామ్	45,535	45,535	59,662	131
కూరగాయలు	2,288	2,301	532	23
	53,228	51,918	64,480	124
మొత్తం	2,12,462	1,72,960	1,67,273	97

- లక్ష్యానికి చేరువలో పంటల సాగు
- ఉద్యాన పంటలపైనే రైతుల ఆసక్తి
- వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ వైపు మొగ్గు

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి సాగు క్రమేపీ ఊపందుకోగా రైతులు సాధారణ విస్తీర్ణంలో 97 శాతం మేర పంటలు వేశారు. గత సీజన్ల మాదిరిగానే ఈ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. వానాకాలం సీజన్ ముగింపులో కురిసిన వర్షాల వల్ల కూడా ఆలస్యానికి ఓ కారణమైంది. అనంతరం మెల్లగా పుంజుకుని ఆశించిన స్థాయిలో పంటల సాగును నమోదు చేసుకుంది. కాగా యాసంగిలో ప్రధానంగా నీటి వనరులకు అవకాశం ఉన్న సాగు భూముల్లో పంటలు సాగు చేస్తారు.

ఉద్యాన పంటలే అధికం

జిల్లాలో యాసంగిలో ఇప్పటివరకు వ్యవసాయ పంటలు 85 శాతం నమోదు చేసుకోగా, ఉద్యాన పంటలు 124 శాతాన్ని నమోదు చేసుకున్నాయి. ప్రధానంగా ఆయిల్‌పామ్‌పై దృష్టి ఎక్కువగా పెడుతుండగా, రైతులు తమ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ను ఎంచుకుంటున్నారు. దీంతో ఆయిల్‌పామ్ లక్ష్యానికి మించి 131 శాతం విస్తీర్ణంలో సాగు చేపట్టారు. ఇక మొక్కజొన్న, వరి ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మొక్కజొన్న పంట 86 శాతం, వరి సాగు 75 శాతం నమోదైంది. మిర్చికి మంచి డిమాండ్ ఉండడంతో లక్ష్యానికి మించి 105 శాతం పంటనమోదు చేసుకుంది. ఇప్పటివరకు జిల్లాలో యాసంగి సీజన్‌లో చెరకు, కంది, ఉలవ తదితర పంటలపై రైతులు ఆసక్తి చూపలేదు. వరిపంట ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆలస్యంగా పంటలు



యాసంగి సీజన్ ఆలస్యం కావడంతో పంటలు కూడా ఆలస్యంగా వేశాం. వానాకాలం సీజన్ చివరిలో పంట దిగుబడుల సమయంలో అకాల వర్షాలు దెబ్బతీశాయి. కోలుకుని వేయడానికి సమయం పట్టింది. –ప్రసాద్, రైతు, లక్ష్మీదేవిపల్లి

క్లుప్తంగా

మొబైల్ కోర్టు నిర్వహణ నిలిపేస్తూ ఉత్తర్వులు

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని మొబైల్ కోర్టు నిర్వహణను నిలిపివేస్తూ పీఓ ప్రతీక్‌జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్వర న్యాయ పరిష్కారం కోసం 1990లో జిల్లాకో మొబైల్ కోర్టు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఖమ్మం జిల్లాకు కేటాయించిన కోర్టును ఆతర్వాత భద్రాచలం ఐటీడీఏ పరిధిలోకి మార్చారు. అయితే వీటి నిర్వహణను కొనసాగిస్తూ చివరిసారిగా 1995లో ఉత్తర్వులు జారీ కాగా.. మళ్లీ ఆతర్వాత కొనసాగింపుపై అధికారులకు ఉత్తర్వులు అందలేదు. ఇంతలోనే నిర్వహణలో లోటుపాట్లు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకున్న ఐటీడీఏ పీఓ.. తాజాగా కోర్టు నిర్వహణను నిలిపేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ప్రభుత్వం తదుపరి నిర్ణయం తీసుకునే వరకు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

సీతమ్మసాగర్ రెండో దశ భూసేకరణకు కసరత్తు



సమావేశంలో పాల్గొన్న ఆర్డీఓ మంగీలాల్, అధికారులు

దుమ్ముగూడెం: సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణం రెండో దశలో భూసేకరణ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా భూనిర్వాసిత రైతులతో దుమ్ముగూడెం తహసీల్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మంగీలాల్ పాల్గొని.. 18.19 ఎకరాల భూమి కోల్పోనున్న 17 మంది రైతులతో చర్చించారు. ఈ విషయంలో అభ్యంతరాలు తెలపాలని, ఆపై ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐలు లక్ష్మయ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్.. మా సమస్యలు పరిష్కరించండి

సీఎంకు పోస్టుకార్డులు పంపించిన విద్యార్థులు



పోస్టు కార్డులతో విద్యార్థినులు

పాల్వంచ: పాల్వంచ పట్టణం సీతారాంపట్నం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం పోస్టు కార్డు లు పంపించారు. అరవై మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉండగా, విద్యావలంటీ ర్లను నియమించడంతో పాటు పారిశుద్ధ్య కార్మికుడిని నియమించాలని, తరగతి గదుల్లో బల్లలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, గురుకులా ల్లో మాదిరిగా నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని వారు సీఎంకు విన్నవించారు.

రిటైర్‌మెంట్ చెల్లింపులపై కోర్టు స్టే

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగిగా బుధవారం ఉద్యోగ విరమణ పొందుతున్న సున్నం సత్యనారాయణకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.26,40,000 ఆపాలని కొత్తగూడెం అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి సోమవారం ఉత్తర్వులు ఇవ్వగా మంగళవారం పిటిషనర్ ఉత్తర్వుల కాఫీని భారజల కర్మాగారం అధికారులకు అందజేసినట్టు తెలిపింది. ఉద్యోగి సత్యనారాయణ గతంలో అశ్వాపురంలో చిట్టీలు నడిపి పలువురికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. అశ్వాపురానికి చెందిన మహిళ తనకు చిట్టీ డబ్బులు రూ.26 లక్షలు చెల్లించాల్సి ఉందని కోర్టును ఆశ్రయించగా ఆమెకు అనుకూలంగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్టు పిటిషనర్ విలేకరులకు తెలిపారు.

ఆ భూమి సర్వే షురూ



సర్వే చేస్తున్న అధికారులు

ఇల్లెందు: సీఎస్‌పీ పంచాయతీ రాజీవ్‌నగర్ వద్ద గల కోళ్లఫారం భూములను అధికారులు మంగళవారం పరిశీలించారు. భూ యజమాని మణి పేరుతో ఓ నోటీసును అటవీశాఖ అక్కడి కోళ్ల ఫారంపై అంటించింది. తహసీల్దార్ కె.రవికుమార్, ఆర్‌ఐ కామేశ్, ఫారెస్టు గార్డు కల్యాణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ ఆ భూమిని పరిశీలించారు. కోళ్ల ఫారం భూమి జోడుబావుల బీట్ కంపార్ట్‌మెంట్ 51లో ఉంది. ప్రభుత్వం జారీ చేసిన అటవీ హక్కుల పత్రం, పట్టా పాస్ బుక్కులు ఉంటే నోటీస్ అందిన మూడు రోజుల్లో ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. పత్రాలు లేకుంటే ఆ భూమిని, కోళ్ల ఫారం ఖాళీ చేసి అటవీశాఖకు అప్పగించాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఇల్లెందు రేంజ్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో రెండుసార్లు నోటీసులు ఇచ్చామని, సమాధానం చెప్పకుంటే మరో నోటీస్ జారీచేస్తామని తెలిపారు.



శ్రీమంతుడు.. శ్రీనివాసరెడ్డి!

అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు వెలువడి దాదాపు రెండు నెలలు కావొస్తోంది. ఈనేపథ్యాన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ బాధ్యులు తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికైన ఎమ్మెల్యేల వివరాలతో నివేదిక విడుదల చేశారు. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా విడుదల చేసిన ఈ నివేదికలో ఎమ్మెల్యేల ఆస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర వివరాలు పొందుపర్చారు. దీని ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేల వివరాలను పరిశీలిస్తే... ఆస్తుల్లో పాలేరు నుంచి ఎన్నికైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి అగ్రభాగాన నిలిచారు. రాష్ట్రవ్యాప్తంగా స్థితిమంతులైన ఎమ్మెల్యేల జాబితాలో ఆయన రెండో స్థానంలో ఉండడం విశేషం. – సాక్షి, ఖమ్మం డెస్క్

ఆస్తుల్లో పొంగులేటికి టాప్ ర్యాంక్

- రాష్ట్రస్థాయి జాబితాలో రెండో స్థానం
- విద్యార్హతల్లో అగ్రభాగాన 'తెల్లం'
- పొంగులేటి, తుమ్మల, ఆదినారాయణపై కేసులు నిల్
- నివేదిక విడుదల చేసిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

ఎంఎస్.. ఎంబీబీఎస్

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేల్లో ఇద్దరు మినహా అందరూ డిగ్రీ, ఆపై విద్యార్హత కలిగి ఉన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఎంఎస్(ఆర్థో), సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఎంబీబీఎస్ పూర్తిచేయగా, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క ఎంఏ, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎమ్మెస్సీ చదివారు. ఇక పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లుకు డిగ్రీ వరకు విద్యార్హత ఉండగా.. కోరం కనకయ్య ప్రాథమిక విద్య పూర్తిచేసినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

కేసులు తక్కువే..

ఎన్నికల్లో పోటీ చేసే ప్రతీ అభ్యర్థి తమపై నమోదైన కేసుల వివరాలు అఫిడవిట్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు జిల్లా నుంచి ఎన్నికైన వారిలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, జారె ఆదినారాయణపై ఒక్క కేసు కూడా లేకపోవడం విశేషం. ఇక కూనంనేని సాంబశివరావు, భట్టి విక్రమార్క, రాందాస్ నాయక్‌పై మూడు చొప్పున, తెల్లం వెంకట్రావుపై రెండు కేసులు ఉన్నాయని వెల్లడించారు. అలాగే, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మట్టా రాగమయిపై ఒక్కో కేసు మాత్రమే ఉన్నాయి.

రూ.100 కోట్లు.. ఆపై ఆరుగురు

రాష్ట్రవ్యాప్తంగా 119 మంది ఎమ్మెల్యేలు సమర్పించిన అఫిడవిట్ల ప్రకారం కుటుంబీకులతో కలిపి రూ.100కోట్లు ఆపైన ఆస్తులు కలిగిన వారు ఆరుగురు ఉన్నారు. ఈ జాబితాలో రూ.606.67కోట్ల ఆస్తులతో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మొదటి స్థానంలో నిలవగా రూ.461.05 కోట్ల ఆస్తులతో పొంగులేటి రెండో స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత స్థానాలు వరుసగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి(మునుగోడు), కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి(భువనగిరి), గడ్డం వినోద్(బెల్లంపల్లి), కొత్త ప్రభాకర్‌రెడ్డి(దుబ్బాక) నిలవగా.. మిగతా వారు రూ.100కోట్లలోపు ఆస్తులే ఉన్నట్లు అఫిడవిట్‌లో పొందుపర్చారు. ఇక మన జిల్లా ఎమ్మెల్యేల విషయానికొస్తే.. తుమ్మల నాగేశ్వరరావు(ఖమ్మం) రూ.17.88కోట్లు, మల్లు భట్టి విక్రమార్క(మధిర) రూ.8.13కోట్లు, పాయం వెంకటేశ్వర్లు(పినపాక) రూ.7.01కోట్లు, మాలోతు రాందాస్‌నాయక్(వైరా) రూ.3.38కోట్లు, కోరం కనకయ్య(ఇల్లెందు) రూ.2.78 కోట్లు, కూనంనేని సాంబశివరావు(కొత్తగూడెం) రూ.2.33కోట్లు, మట్టా రాగమయి(సత్తుపల్లి) రూ.1.92కోట్లు, తెల్లం వెంకట్రావు(భద్రాచలం) రూ.1.45కోట్లు, జారె ఆదినారాయణ(అశ్వారావుపేట) రూ.57లక్షల మేర ఆస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

జీఓ–3 అమలు, పోడు సమస్య పరిష్కరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించిన ఏటీఎఫ్ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(టీఎస్‌ఏటీఎఫ్) నాయకులు కోరారు. ఈ సందర్భంగా టీఎస్‌ఏటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి ఆధ్వర్యాన హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆదివాసీ ఉపాధ్యాయుల నియామకాలు, పదోన్నతులకు సంబంధించి జీఓ 3కు చట్టబద్ధత కల్పించాలని, భవిష్యత్‌లో అన్ని నియామకాలు ఈ జీఓ ఆధారంగానే చేపట్టాని కోరారు. అంతేకాక ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏజెన్సీ అలవెన్స్ మంజూరు చేయాలని, ప్రత్యేకంగా ఏజెన్సీ డీఎస్సీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులపై పునరాలోచన చేయాలని, ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం గిరిజన శాఖ మంత్రి సీతక్కకు కూడా వారు వినతిపత్రం అందజేశారు. సీఎంను కలిసిన వారిలో నాయకులు పీర్ల కృష్ణబాబు, లచ్చు పటేల్, కోరం సంతోష్‌కుమార్, కొప్పుల రవి, పాయం ఆనంద రావు, చాపల రమేశ్‌బాబు, కల్తీ భాస్కర్‌రావు, సూర్నపాక సత్యనారాయణ, పాయం రాధ, కోరం నందు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రుణాల పేరుతో దందా



మద్దికొండలో నగదు వసూలు చేస్తున్న బృందం

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వం అందిస్తున్న రుణాలను ఇప్పిస్తామని, ఆన్‌లైన్ పేరుతో ఓ ముఠా గిరిజన గ్రామాల్లో దందాకు పాల్పడుతోంది. గిరిజనులు, నిరక్షరాస్యుల వద్ద ఈ ముఠా నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం కొంతమంది స్థానికులు ఈ వ్యవహారంపై ప్రశ్నించడంతో అక్కడినుంచి వెళ్లిపోయారు. వివరాలిలా..మండలంలోని మద్దికొండ గ్రామంలో రెండు రోజులుగా పాల్వంచ, ములకలపల్లి మండలాలకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఆటోలో తిరుగుతున్నారు. ఈ ముఠాలోని వ్యక్తులు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను ఆన్‌లైన్ చేస్తున్నట్లు ముందుగా తమకు పరిచయం ఉన్నవాళ్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆ తర్వాత గ్రామానికి ఆటోలో వచ్చి, తమ వెంట తెచ్చుకున్న ల్యాప్ ట్యాప్‌లో లబ్ధిదారుల వివరాలు నమోదు చేసి, పథకానికి సంబంధించిన దరఖాస్తు ఫారంపై ఆన్‌లైన్ చేసినట్లు ఏఓ నంబర్లు రాసి ఆశావహులకు అందిస్తున్నారు. పథకానికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ చేసినందుకు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.500 నుంచి రూ.600 చొప్పున వసూలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. ఈ ముఠా మద్దికొండతో పాటు పలు గ్రామాల్లో ఇదే విధంగా ఆన్‌లైన్ పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ పథకాల పేరుతో నగదు వసూలుకు పాల్పడుతున్న వ్యక్తులపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, కఠినచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దడ పుట్టిస్తున్న ఎలుగుబంటి..

- రెండోరోజు మరో వ్యక్తిపై దాడి
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు



అధికారులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

చండ్రుగొండ: మండలంలో రెండోరోజు ఎలుగుబంటి మరో వ్యక్తిపై దాడి చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. చండ్రుగొండలోని అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం వేకువజామున కంచర్ల తిరుపతిపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. సోమవారం మద్దుకూరు గ్రామశివారులోని రైల్వేబ్రిడ్జి వద్ద నల్లమోతు రామారావుపై దాడి చేసిన విషయం విదితమే. రెండోరోజు చండ్రుగొండ గ్రామానికి చేరుకున్న ఎలుగుబంటి జనావాసాల్లోకి రావడం గమనార్హం. వేకువజామునే నిద్రలేచిన తిరుపతి మూత్రవిసర్జనకు బయటకు రాగానే ఒక్కసారిగా అతడిపై ఎలుగుబంటి దాడి చేసింది. తేరుకున్న అతడు కేకలు వేయడంతో పారిపోయింది. విషయం తెలిసిన ప్రజలు ఎలుగుబంటి ఎటు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని గ్రామస్తులు భయంగా గడిపారు. సమాచారం అందుకున్న రేంజర్ ఎల్లయ్య సిబ్బందితో ఎలుగుబంటి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కానీ, దాని ఆచూకి దొరకలేదు. కాగా, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు తిరుపతిని రేంజర్ ఎల్లయ్య పరామర్శించారు. శాఖాపరంగా బాధితులకు ఆర్థికసాయం అందిస్తామని రేంజర్ తెలిపారు. ఎలుగుబంటి ఉదంతంపై తహసీల్దార్ సాదియాసుల్తాన, ఎస్ఐ మాచినేని రవి, రేంజర్ ఎల్లయ్య సమీక్షించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎలుగుబంటిని పట్టుకుంటాం..

దారితప్పి జనవాసాల్లోకి వచ్చిన ఎలుగుబంటిని ఎట్టి పరిస్థితుల్లోనైనా పట్టుకుంటామని ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన చండ్రుగొండ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఎలుగుబంటిని పట్టుకుంటామని, నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని, పంటచేలకు వెళ్లే రైతులు చేతిలో కర్ర ఉంచుకోవాలని, సాధ్యమైనంత వరకు ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు. దారితప్పిన ఎలుగుబంటి నాలుగైదు రోజులపాటు ఈ ప్రాంతంలోనే ఉండే అవకాశం ఉందన్నారు. ఎలుగుబంటి దాడిలో గాయపడిన వారికి రూ.లక్ష, మృతులకు రూ.5 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని తెలిపారు.

40 కేజీల గంజాయి స్వాధీనం

బస్సులో తరలిస్తున్న నలుగురు అరెస్ట్



గంజాయి, నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగయ్య కథనం ప్రకారం.. మంగళవారం అశ్వారావుపేట సమీపంలోని అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఏపీలోని కాకినాడ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును నిలిపి తనిఖీ చేస్తున్న సమయంలో వరంగల్ జిల్లా నర్సంపేట మండలం తాజుపల్లికి చెందిన మంతోజు స్వరూప, దారా కట్టస్వామి అలియాస్ బాబు, కడారి నిర్మలతో పాటు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం గ్రామానికి చెందిన చామకూరి మాధవి బస్సు దిగి పారిపోవడానికి యత్నించారు. గమనించిన ఎక్సైజ్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకొని బ్యాగులను పరిశీలించగా వాటిలో 38 కేజీల నిషేధిత గంజాయి లభ్యమైందని ఎక్సైజ్ సీఐ తెలిపారు. పట్టుబడిన నిందితులను స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా ఏపీలోని రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల్లో కిలో గంజాయిని రూ.4 వేలకు కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల ముసుగులో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు శ్రీహరి, వెంకటేశ్, సిబ్బంది ఉన్నారు.


భద్రాచలంలో...

భద్రాచలంఅర్బన్: వాహన తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి 2.6 కేజీల ఎండు గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఖమ్మం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్, బస్టాండ్, గోదావరి బ్రిడ్జి సెంటర్‌లోని ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఖమ్మం నగరానికి అద్దంకి పవన్ ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. అతడి వద్ద 2.6 కేజీల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకున్నారు. అతడి బైక్, సెల్‌ఫోన్‌ను సైతం స్వాధీనం చేసుకున్నారు. కాగా, పవన్ ఆంధ్ర – ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి ఖమ్మానికి తీసుకెళ్లి చిన్న, చిన్న పొట్లాలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది.

బైక్ చోరీల నిందితులు అరెస్ట్

భద్రాచలంఅర్బన్: బైక్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు బ్రిడ్జి సెంటర్లోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ విజయలక్ష్మి వాహన తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని ముదిరాజ్‌బజార్‌కు చెందిన ఆకునూ రాజేంద్రప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచా రించగా పట్టణంలోని యూబీరోడ్డు, లంబాడకాలనీల్లో రెండు బైక్‌లను చోరీ చేసినట్లు తేలింది. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. కాగా, పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేసిన, ములకలపల్లి మండలం చెవిటిగూడెంకి చెందిన జుజ్జునూరి శ్రీనును పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఎస్ఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని కట్టుగూడెం గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏపీలోని గుంటూరు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్న కారు కట్టుగూడెం గ్రామ సమీపాన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న కృష్ణారావు కాలు విరగగా, ద్విచక్రవాహనదారుడు శివప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పినపాక: పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మణుగూరు మండలంలోని రామానుజవరం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. భూపతిరావుపేట గ్రామానికి చెందిన నవీన్ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ట్యాంక్ పైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

బూర్గంపాడు: సారపాక ప్రధాన కూడలిలోని ఓ వాటర్ ట్యాంకు పైనుంచి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం సారపాకలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు పైకెక్కిన ఓ వ్యక్తి అక్కడినుంచి పడిపోవటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి చూసేసరికి అతను మృతి చెందినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ రాజ్‌కుమార్ ఘటనా ప్రాంతానికి చేరు కుని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడు ఇల్లెందు మండలం సుదిమళ్ల గ్రామానికి చెందిన నర్సయ్య (47)గా గుర్తించారు. సోమవారం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వచ్చిన నర్సయ్య మంగళవారం తెల్లవారుజామున సారపాకకు చేరుకున్నారు. ఆ తరువాత వాటర్‌ట్యాంక్ ఎక్కి కిందకు దూకి మృతిచెందాడు. కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవటంతో నర్సయ్య అప్పుడప్పుడూ బయటకు వెళ్లిపోతుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వాటర్ ట్యాంకు ఎక్కిన నర్సయ్య ప్రమాదవశాత్తు జారిపడ్డాడో.. లేక ఆత్మహత్య చేసుకున్నాడో తెలియటం లేదు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నా రు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళారులకు దేహశుద్ధి

పాల్వంచ: పత్తి కాంటా వేసే క్రమంలో మోసం చేసిన దళారులకు రైతులు మంగళవారం దేహశుద్ధి చేశారు. జూలూరుపాడుకు చెందిన నలుగురు వ్యక్తులు కలిసి మండలంలోని ప్రభాత్‌నగర్‌లో రైతులు సతీశ్, జైపాల్, వెంకటరెడ్డి తదితరుల నుంచి పత్తి కొనుగోలు చేసి ఏడు క్వింటాళ్లు ఉందని తెలిపారు. అయితే, రైతులు అనుమానంతో మరోచోట కాంటా వేయించగా 11 క్వింటాళ్లు వచ్చింది. ఇంతలోనే మరికొందరు రైతులు అక్కడకు చేరుకుని దళారులకు దేహశుద్ధి చేశాక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఘటనలపై ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇసుక లారీకి జరిమానా

దుమ్ముగూడెం: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీకి రూ.50 వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. కొన్ని రోజుల కిందట చర్ల మండలం కొత్తపల్లి ఇసుక ర్యాంపు నుంచి మండలంలోని సీతారాంపురంలోని ఏకలవ్య పాఠశాలకు ఒకే వే బిల్లుపై మూడు ట్రిప్పుల ఇసుక రవాణా చేస్తున్న లారీని గ్రామస్తులు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. కాగా, లారీకి తహసీల్దార్ చంద్రశేఖర్ రూ.50 వేలు జరిమానా విధించారు.

యూట్యూబ్ విలేకరిపై కేసు

పాల్వంచ: ట్రాక్టర్ యజమాని నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్న యూ ట్యూబ్ ఛానల్ విలేకరిపై పాల్వంచ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పట్టణంలోని బొల్లేరుగూడెంకు చెందిన ట్రాక్టర్ యజమాని తిరుమలకొండ దుర్గాప్రసాద్‌ను యూ ట్యూబ్ ఛానల్ విలేకరి అయిన ఖలీష్ ట్రాక్టర్ తిరగాలంటే తనకు డబ్బు ఇవ్వాలని బెదిరిస్తున్నాడు. ఈనెల 29న కూడా బెదిరించగా దుర్గాప్రసాద్ చేసిన ఫిర్యాదు మేరకు ఖలీష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు.

వైల్డ్‌లైఫ్ ఏరియాలో చెట్లు నరికివేత?

అశ్వాపురం: మండలంలోని వెంకటాపురం గ్రామ పంచాయతీ పాలవాగు గ్రామంలోని పాల్వంచ వైల్డ్‌లైఫ్ జోన్‌లో పెద్ద వృక్షాలను నరికి కలపను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పాలవాగు వైల్డ్‌లైఫ్ ఏరియాలో అంతకు ముందు పోడు రైతులు నాటిన మొక్కలు పెద్ద వృక్షాలుగా ఎదిగాయి. ఈ చెట్లను నరుకుతున్న కొందరు కలపను వెంకటాపురం, పాలవాగు గ్రామాల మధ్య నిల్వ ఉంచి రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాకు ప్లాంటేషన్‌కు రక్షణగా ఉండే వాచర్ కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎంతోకాలంగా పోడు చేసుకుంటున్న తమ భూములను లాక్కున్నారని, ఇప్పుడు అక్రమంగా పెద్ద చెట్లు నరికి అమ్ముకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు మండిపడుతున్నారు.

తేనెటీగల దాడిలో మహిళ మృతి

పినపాక: తేనెటీగల దాడిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన సూర్యకాంతం(30) ఆధార్ అప్‌డేట్ కోసం అమరారం గ్రామానికి వెళ్తుండగా గ్రామ శివారులో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. గమనించిన కుటుంబ సభ్యులు పినపాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తరలించేందుకు యత్నిస్తున్న సమయంలో ఆమె మృతిచెందింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

జూలూరుపాడు: ఎద్దు దాడి చేసిన ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందగా మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ జీవన్‌రాజు కథనం ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన బానోత్ వాల్యా (55) ఈ నెల 27న మధ్యాహ్నం ఎడ్లకు మేత వేస్తుండగా ఓ ఎద్దు అతడిని బలంగా నెట్టింది. దీంతో వాల్యా పక్కనే ఉన్న కాలువలో పడి తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జీవన్‌రాజు వెల్లడించారు.

బస్సును ఢీకొన్న లారీ

జూలూరుపాడు: మండలంలోని వినోభానగర్ సమీపాన మంగళవారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టగా ప్రయాణికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఖమ్మం నుంచి మణుగూరు వెళ్తుండగా వినోభానగర్ దాటాక వెనక నుంచి లారీ ఢీకొట్టింది. బస్సు వెనక అద్దం పగిలి పోగా తృటిలో ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.